జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం | 7 | సెప్టెంబర్ | 2025 ◆ పేజీలు : 6

## భద్రాద్రి కా మహారాజ్ వినాయకుడిని దర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్



**భద్రాచలం, సెప్టెంబర్ 6, ప్రజాజ్యోతి :** భద్రాచలం పట్టణంలోని భద్రాద్రి కా మహారాజ్ వినాయకుడిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ శనివారం దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణానికి విచ్చేసిన ఆయనకు కమిటీ సభ్యులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి వినాయక స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్ రాజ్ మాట్లాడుతూ వినాయకుని ఆశీస్సులు

మిగతా 2 లో...



# ఆర్థిక లావాదేవిలతో ఒకరు మృతి

- మాజీ మున్సిపల్ చైర్మన్ కారణమంటూ మృతుని బంధువుల ఆరోపణ
- మృతదేహంతో డివి ఇంటి ముందు ఆందోళన
- రూ. 1. 5 కోట్లకు పైగా డబ్బులు ఇవ్వాలంటున్న వైనం
- డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేసారంటున్న బంధువులు
- న్యాయం చేయాలని డిమాండ్
- పరారీలో మాజీ మున్సిపల్ చైర్మన్ డివి

2 లో..





## కిడ్నీ వ్యాధితో డయాలసిస్ కేంద్రంకు వెళితే...

- హెచ్ఐవి సోకిందంటూ వైద్యులు చెప్పారు
- డయాలసిస్ కేంద్రం వద్ద బాధితుడి ఆందోళన




**మణుగూరు, సెప్టెంబర్ 6, (ప్రజాజ్యోతి):** మణుగూరు ప్రభుత్వ 100 పడకల ఆసుపత్రిలో గత ఏడు నెలల నుండి మూత్రపిండాల వ్యాధితో బాధపడుతూ... డయాలసిస్ చేయించుకునేందుకు వెళ్ళితే అతనికి హెచ్ఐవి ఉన్నట్లుగా డాక్టర్లు నిర్ధారణ చేశారు. మణుగూరు వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగికి హెచ్ఐవీ ఉన్నట్లుగా డాక్టర్లు నిర్ధారణ చేశారు. ఈ విషయంపై శనివారం కిడ్నీ చికిత్సకు వెళితే, హెచ్ఐవీ సోకిందని డయాలసిస్ కేంద్రం వద్ద బాధితుడి ఆందోళనకు దిగాడు. ఏడు నెలల పాటు డయాలసిస్ చేయించుకున్న తర్వాత పాజిటివ్‌గా నిర్ధారణ

మిగతా 2 లో...

## వినాయక.. వీడ్కోలిక..

- భద్రాద్రి గోదారి తీరాన ఘనంగా గణేష్ నిమజ్జనం



**భద్రాచలం, సెప్టెంబర్ 6, ప్రజాజ్యోతి :** భద్రాచలం గోదావరి నదిలో వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరుగుతోంది. ఇప్పటివరకు రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన దాదాపు 1029 పెద్ద విగ్రహాలు, మరో 523 చిన్న విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు అధికారులు తెలిపారు. గత రెండు సంవత్సరాల క్రితం నిమజ్జనానికి వచ్చి

మిగతా 2 లో...

## గణేష్ నిమజ్జనోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పర్యవేక్షణ

**భద్రాచలం, సెప్టెంబర్ 6 (ప్రజాజ్యోతి):** భద్రాచలంలో గోదావరి నదీ తీరంలో గణేష్ నిమజ్జనోత్సవం విజయవంతంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా గణేశ



మిగతా 2 లో...

## ఎన్కౌంటర్ మావోయిస్టును గుర్తింపు

- ప్లాటూన్ నెంబర్ 16 కమాండర్ గా గుర్తింపు
- మృతి చెందిన మహిళా మావోయిస్టుపై ఎనిమిది లక్షల రివార్డు
- భారీగా ఆయుధాలు పేలుడు పదార్థాలు స్వాధీనం



6 లో...

# భద్రాద్రి కా మహారాజ్ వినాయకుడిని దర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్

(మొదటి పేజీ తరువాయి...)

అందరికీ లభించాలని, భక్తి, ఐకమత్యం, సౌభ్రాతృత్వంతో జరుపుకునే ఈ ఉత్సవాలు సమాజంలో మంచి విలువలను పెంపొందిస్తాయని తెలిపారు. భద్రాచలం ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ఈ పండుగలు మరింత వైభవం చేకూరుస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఎస్పీతో పాటు భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, సీఐ నాగరాజు కూడా స్వామివారి పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం భక్తుల రద్దీతో కిక్కిరిసి, "గణపతి బప్పా మోరియా" నినాదాలతో మార్మోగింది. కమిటీ సభ్యులు పోలీసు అధికారులకు శాలువాలు కప్పి సత్కరించారు. అనంతరం అధికారులందరికీ ఆశీర్వచనం అందజేశారు. అధికారులు వినాయకుడి మహిమ గురించి తెలియజేసి భక్తులు నిబద్ధతతో పాల్గొనడం సమాజానికి స్ఫూర్తిదాయకమని అన్నారు.

# వినాయక.. వీడ్కోలిక..



(మొదటి పేజీ తరువాయి...)

టేకులపల్లి మండలానికి చెందిన ఓ బాలుడు గోదావరి నదిలో గల్లంతై మృతి చెందాడు. దీంతో ఈ ఏడాది భక్తు లను గోదావరి నదిలో స్నానాలకు కూడా అనుమతించలేదు.

### ముందస్తు ప్రణాళికతో

భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ నేతృత్వంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నారు. పట్టణంలో కూడా ట్రాఫిక్ కు అంతరాయం కలుగకుండా ముందస్తు ప్రణాళికలతో చర్యలు చేపట్టారు. పట్టణంలో వాహనాల కోసం పార్కింగ్ స్థలాలను కేటాయించారు. విగ్రహాల తరలింపుపై అధికారుల రూట్ మ్యాప్ సిద్ధం చేయడంతో నిమజ్జన వేడుక సజావు గా సాగుతోంది. కాగా, ఆదివారం కూడా నిమజ్జనాలు కొనసాగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.భద్రాచలం వద్ద గోదావరి నదిలో శుక్రవారం అర్ధరాత్రి 1 గంట నుంచి శనివారం ఉదయం 9 గంటల వరకు వినాయక విగ్రహాల నిమజ్జనానికి భారీగా వచ్చిన ఎటువంటి అంతరాయం ఏర్పడకుండా భద్రాచలం తహసీల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు ,గ్రామపంచాయతీ ఈ ఓ చేరుకుమల్లి శ్రీనివాసరావు లు స్వయంగా అక్కడే ఉండి పర్యవేక్షిస్తున్నారు . శనివారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ స్వయంగా వచ్చి వినాయక నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలించి తహసీల్దార్ తహసీల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు,గ్రామపంచాయతీ ఈ ఓ చేరుకుమల్లి శ్రీనివాసరావు లకు పలు సూచనలు చేసారు

### అవాంఛనీయ సంఘటనల చోటుచేసుకోకుండా చర్యలు :తహసీల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు



జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి విగ్రహాల నిమజ్జనానికి భారీగా తరలివచ్చారు.ఎటువంటి అవాంఛనీయ సంఘటనల చోటుచేసుకోకుండా చర్యల తీసుకుంటున్నాము ,అదేవిధంగా పోలీసులు ముందస్తుగా కట్టు దిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఎక్కడా అంతరాయం కలగలేదు.

### మూడేళ్ళుగా ఇక్కడే నిమజ్జనం: శ్రీను ,3ఇన్ క్లయిన్ కొత్తగూడెం



మేము మూడేళ్ళుగా వినాయక విగ్రహాలను భద్రాచలం గోదావరి నదిలోనే నిమజ్జనం చేస్తున్నాం.మా కొడుకుతోపాటు మా కుటుంబ సభ్యులం కూడా భద్రాచలం వచ్చి ఈ వేడుకలో పాల్గొంటున్నాం.

# ఆర్థిక లావాదేవిలతో ఒకరు మృతి



**ఇల్లందు, సెప్టెంబర్ 6, ప్రజాజ్యోతి:** ప్రస్తుత సమాజంలో మానవ సంబంధాలకు కనీసం విలువ లేకుండా పోతుందనేది వాస్తవం. ఇదే కోవలో గత కొన్ని ఏళ్లుగా తనకు అన్ని విధాలుగా ఆర్థికంగా అండగా ఉన్న వ్యక్తికే వెన్నుపోటు పొడిచి సభ్య సమాజం తలదించుకునేలా వ్యవహరించిన ఉదంతమది. ఎక్కడో ఒక మారుమూల గ్రామంలో ఉంటూ వ్యవసాయం చేసుకుంటూ ఎంతో కొంత ఆర్థికంగా బలోపేతం అవుతూ, ఎందరికో ఆదర్శంగా నిలవాలనుకున్న ఆయన ఆశయం వృధా అయిందనేది వాస్తవం. ఖమ్మం జిల్లా సింగరేణి మండలం మొట్లగూడెం గ్రామానికి చెందిన గడిపర్తి శ్రీనివాస్ కు సుమారుగా గత 20 ఏళ్లుగా పైగా సాన్నిహిత్యం ఉండడంతో, ఏదో విధంగా ఆర్థికంగా బలోపేతమైన గడిపర్తి శ్రీనివాసరావును అదే ప్రాంతానికి చెంది, ఇల్లందులో విద్యా సంస్థలను నిలకొల్పి రాజకీయ అరంగ్రేటం చేసి అనతి కాలంలోనే ఇల్లందు మున్సిపల్ చైర్మన్ అయినా దమ్మలపాటి వెంకటేశ్వరరావును నమ్మి ఆర్థికంగా రూ. 1.5 కోట్లకు పైగా మోసం చేయడంతో మానసిక క్షోభకు గురై ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం జరిగింది. తను నమ్ముకున్న వ్యక్తి ఆర్థికంగా నష్టం చేస్తున్నాడన్న విషయాన్ని జీర్ణించుకోలేక ఆ వ్యక్తి గడిపర్తి శ్రీనివాసరావు పడిన మనోవేదన ఎందరినో కంటతడి పెట్టించింది. రూ. 1.5 కోట్లకు పైగా ఇచ్చిన డబ్బులను తిరిగి ఇవ్వాలని అడిగినందుకు ఎన్నో విధాలుగా ఇబ్బందులకు గురి చేసినప్పటికీ తాను నమ్మిన వ్యక్తి ఎప్పటికీ మోసం చేయడమే మొండి నమ్మకంతో జీవనాన్ని కొనసాగిస్తున్నప్పటికి చివరకు తాను ఎప్పటికీ మోసపోనని నమ్మిన వ్యక్తి తనని మోసం చేసిన విషయం తెలుసుకున్న ఆ వ్యక్తి గుండె అవిసెల బాధపడి తనువు చాలించాడని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. తాను నమ్మిన వ్యక్తి దమ్మాలపాటి వెంకటేశ్వరరావు రూ. 1.5 కోట్లకు పైగా ఆర్థిక లావాదేవీల విషయంలో గత రోజున ఖమ్మంలో పంచాయతీ నిర్వహించగా ప్రముఖ సాహితీ జూనియర్ కళాశాల డైరెక్టర్ ఎంసి నాగిరెడ్డి హాజరు కావడంతో తాను వస్తే పంచాయతీలో ఏమి మాట్లాడనని మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మలపాటి వెంకటేశ్వరరావు తెలిపినట్లు మృతుడి సోదరుడు, సోదరి తెలిపారు. దీంతో వేరే ప్రత్యామ్నాం లేక వారు నాగిరెడ్డిని ఆ పంచాయతీ నుండి బయటకు పంపినప్పటికి సమస్య పరిష్కారం కాలేదన్నారు. దీంతో మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుకు వరుసకు సోదరుడైన దమ్మలపాటి ప్రసాద్ గడపర్తి శ్రీనివాసరావును ఇల్లందుకు వస్తే నీ కాళ్లు విరగగొడతానని బెదిరించినట్లు శ్రీనివాసరావు సోదరి, సోదరుడు ఆరోపించారు. ఈ క్రమంలో తీవ్ర మనోవేదనకు గురైన గడిపర్తి శ్రీనివాసరావు ముందస్తుగా తన వాహనంలో తెచ్చుకున్న పురుగుల మందుతో కారేపల్లి మండలంలోని మొట్లగూడెం గ్రామంలో తన వ్యవసాయ క్షేత్రంలో మనస్థాపనతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. తెల్లవారుజామున స్థానికుల సమాచారం రావడంతో అప్పటికే గడిపర్తి శ్రీనివాసరావు మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ఇల్లందు పట్టణంలోని మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు ఇంటికి తీసుకువచ్చి ఆందోళన నిర్వహించడంలో పాటు ఇంట్లో వాహనం, ఇంటిని కొంత ధ్వంసం చేసినట్లు తెలుస్తుంది. ముఖ్యంగా డబ్బుల విషయం వల్లనే తమ సోదరుడు మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. తమ సోదరుడికి, మున్సిపల్ మాజీ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుల మధ్య ఆర్థిక లావాదేవీలు ఉన్నాయని, అవి పరిష్కారం కాకపోవడం వల్లనే మనోవేదనకు గురైనట్లు పేర్కొన్నారు. ఏన్ని సార్లు అడిగిన కానీ డబ్బులు ఇవ్వలేదన్నారు. విషయం తెలుసుకున్న ఇల్లందు డిఎస్పి ఎన్. చంద్రభాను ఆధ్వర్యంలో సిఐ తాటిపాముల సురేష్ నేతృత్వంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి గడిపర్తి శ్రీనివాస్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇల్లందు ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించారు. కాగా గడపర్తి శ్రీనివాసరావు పురుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకున్న మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు ఇల్లందు నుండి పలయనం చిత్తగించినట్లు సమాచారం. మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మలపాటి వెంకటేశ్వరరావు ఎక్కడున్న పట్టుకొని కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇలా ఎవరు మరో మారు మోసపోవద్దని, తగిన విధంగా బుద్ధి చెప్పాలని గడిపర్తి శ్రీనివాస్ కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. కాగా మృతుడు గడిపర్తి శ్రీనివాస్ భార్య రమ ఫిర్యాదు మేరకు కారేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గణేష్ నిమజ్జనోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు



(మొదటి పేజీ తరువాయి...)

నవరాత్రులు ముగిసిన అనంతరం, వివిధ మండపాల నుండి విగ్రహాలను గోదావరి నదిలో నిమజ్జనం చేయడానికి పెద్ద ఎత్తున భక్తులు భద్రాచలానికి తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో గోదావరి కరకట్ట వద్ద నిమజ్జనం జరిగే ప్రదేశాలను జిల్లా ఎస్పీ శనివారం ప్రత్యక్షంగా పరిశీలించారు. అక్కడి అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు.ఎస్పీ మాట్లాడుతూ నిమజ్జనోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు విభాగం పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టిందని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం నదీ తీర ప్రాంతంలో రక్షణ బృందాలు, అంబులెన్స్ సేవలు, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. రద్దీగా ఉండే ప్రదేశాల్లో ట్రాఫిక్ అంతరాయం లేకుండా ప్రత్యేక పట్రోలింగ్ బృందాలు పనిచేస్తున్నాయని వివరించారు.నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా పూర్తి కావడానికి ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసు సూచనలను తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. డీజేలు, బాణాసంచా కాల్చడం, చట్టవిరుద్ధ కార్యకలాపాలు పూర్తిగా నిషేధించబడ్డాయని హెచ్చరించారు. చట్టానికి విరుద్ధంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.జిల్లా వ్యాప్తంగా నిమజ్జన ఊరేగింపులు మరియు నిమజ్జన కార్యక్రమాలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరుగుతాయని ఎస్పీ తెలిపారు. భక్తులు భద్రతా నియమాలను పాటించి, మత సామరస్యంతో, శాంతియుత వాతావరణంలో గణేష్ నిమజ్జనాన్ని నిర్వహించేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో భద్రాచలానికి చేరుకుంటున్నందున ఎవరికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ రోహిత్ రాజు స్పష్టం చేశారు. భక్తిశ్రద్ధలతో వినాయక నవరాత్రులను ముగించుకొని జరిగే నిమజ్జన కార్యక్రమం ప్రతి ఒక్కరికీ ఆనందాన్నిచ్చేలా అధికారులు, నిర్వాహకులు, భక్తులు సహకరించాలని పిలుపునిచ్చారు.

## కిడ్నీ వ్యాధితో డయాలసిస్ కేంద్రంకు వెళితే...

(మొదటి పేజీ తరువాయి...)

ఎలా వచ్చిందని బాధితుడు ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. కేంద్రం ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి వచ్చిందంటూ బాధితుడి ఆరోపణలు చేస్తున్నారు. ఆసుపత్రి వద్ద కుటుంబ సభ్యులతో కలిసి వృద్ధుడి ఆందోళన నిర్వహించారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్న ఓ వృద్ధుడికి హెచ్ఐవీ సోకింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. డయాలసిస్ కేంద్రం సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే తనకు ఈ వ్యాధి సోకిందని ఆరోపిస్తూ బాధితుడు మణుగూరులోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగాడు. అశ్వాపురం మండలానికి చెందిన 60 ఏళ్ల గిరిజన వృద్ధుడు మూత్రపిండాల సమస్యతో ఈ ఏడాది జనవరిలో మణుగూరులోని డయాలసిస్ కేంద్రంలో చేరాడు. చికిత్స ప్రారంభించే ముందు నిర్వహించిన పరీక్షల్లో ఆయన రక్తహీనతతో బాధపడుతున్నట్టు వైద్యులు గుర్తించారు. దీంతో జనవరి 15న భద్రాచలం బ్లడ్ బ్యాంక్ నుంచి రక్తాన్ని తెప్పించి ఆయనకు ఎక్కించారు. అప్పటి నుంచి ఆగష్టు 15 వరకు దాదాపు ఏడు నెలల పాటు వారానికి మూడుసార్లు డయాలసిస్ సేవలు అందించారు. ఆగస్టు 15న నిర్వహించిన రక్త పరీక్షల్లో అతడికి హెచ్ఐవీ పాజిటివ్ అని తేలడంతో కుటుంబ సభ్యులు షాక్‌కు గురయ్యారు. నిర్ధారణ కోసం ఓ ప్రైవేటు ల్యాబ్‌లో పరీక్ష చేయించగా అక్కడ కూడా అదే ఫలితం వచ్చింది. దీంతో మణుగూరు కేంద్రంలో ఆయనకు డయాలసిస్ సేవలను నిలిపివేసి, భద్రాచలంలోని హెచ్ఐవీ కేంద్రంలో మందులు అందిస్తున్నారు. బాధితుడు ప్రస్తుతం హెచ్ఐవీ రోగుల కోసం ప్రత్యేకంగా సేవలు అందించే హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి వెళ్లి డయాలసిస్ చేయించుకోవాల్సి వస్తోంది. ఈ ఘటనపై డయాలసిస్ కేంద్రం నిర్వాహకుడు సంతోష్ రెడ్డి మాట్లాడుతూ... ఆ రోగి తమ కేంద్రానికి రాక ముందు హైదరాబాద్, ఖమ్మం, వరంగల్ లోని పలు ఆసుపత్రులలో చికిత్స పొందారని, ఆ సమయంలో ఎక్కడైనా పొరపాటు జరిగి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బాధితుడి కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు.



కిడ్నీ వ్యాధిగ్రస్తుడుకి జరిగిన అన్యాయంపై విచారణ ప్రారంభిస్తున్నాం... దయాలసిస్ జిల్లా అధికారి కిరణ్ కుమార్

# జీవవైవిధ్య అభివృద్ధి కార్యక్రమం

- ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ అటవీ శాఖ చైర్మన్ పోదెం వీరయ్య





చర్ల, సెప్టెంబర్ 06: (ప్రజా జ్యోతి ): చర్ల మండలంలో శనివారం కొయ్యురులోని అటవీ ప్రాంతంలో ఐ టి సి మిషన్ సునెప్రోకల్ ఆధ్వర్యంలో చేపట్టిన బయోడైవర్సిటీ డెవలప్మెంట్ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా తెలంగాణ అటవీ శాఖ చైర్మన్ పొదెం వీరయ్య పాల్గొన్నారు .ఈ సందర్భగా వారు మాట్లాడుతూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉండాల్సిన అవసరాన్ని గ్రామ ప్రజలకు వివరించారు. భవిష్యత్ తరాల కోసం ప్రకృతి సంపదలను కాపాడుకోవడం అత్యవసరమని, కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పర్యావరణం ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తుందని ఆయన అన్నారు.అలాగే గ్రామ ప్రజలతో మమేకమై వారి స్థానిక సమస్యలు, అవసరాలు, అభివృద్ధి కార్యక్రమాలపై విపులంగా చర్చించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ స్థాయిలో తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో చర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆవుల విజయ్ భాస్కర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఇర్ప శ్రీను, సీనియర్ నాయకులు బండారు రామకృష్ణ, జవ్వాది రవి, బసవయ్య, ఇందల బుచ్చిబాబు, మెడిచర్ల కుమార్, ఆవుల పుల్లారావు, శ్రీను, వరప్రసాద్, కాకర్ల కుమార్, సత్తిబాబు, సోడి చలపతి, మేడబత్తిని మనోహర్, బుల్లిబాబు, వాసు, తిరుపతి రావు ఏడెల్లి, భాస్కర్, రాజా, వ్యయసాయ అధికారులు ,తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పినపాక జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో మృతుని కుటుంబానికి 25 కేజీల బియ్యం వితరణ



పినపాక, సెప్టెంబర్ 06(ప్రజాజ్యోతి ): పినపాక మండలంలోని పినపాక జర్నలిస్టు సంఘం ఆధ్వర్యంలో జర్నలిస్టు డే సందర్భంగా. మానవతా దృక్పథంతో పినపాక జర్నలిస్టుల సంఘం మరోసారి తమ సేవా కార్యక్రమంతో చాటుకుంది. మండలంలోని పినపాక గ్రామానికి చెందిన కొండ్రు వీరయ్య, w/o సుశీల.ప్రధానుడు ఆకస్మికంగా కన్నుమూసిన నేపథ్యంలో ఆ కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ పరిస్థితిని గమనించిన పినపాక జర్నలిస్టుల సంఘం ప్రతినిధులు ముందుకు వచ్చి సహాయం అందించారు.సంఘం ఆధ్వర్యంలో మృతుని కుటుంబానికి 25 కేజీల బియ్యం వితరణ చేసి పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చిన జర్నలిస్టులు, సంఘం ఎల్లప్పుడూ ప్రజల పక్కనే ఉంటుందని, అవసరమైన చోట సహాయం చేసేందుకు ముందుంటుందని హామీ ఇచ్చారు. బాధలో ఉన్న కుటుంబానికి ధైర్యం చెప్పడమే కాకుండా భవిష్యత్తులో కూడా తగినంత సహకారం అందిస్తామని పేర్కొన్నారు.సంఘం నాయకులు మాట్లాడుతూ – "జర్నలిస్టు అంటే కేవలం వార్తలు రాయడమే కాదు, సమాజానికి అవసరమైన సందర్భంలో అండగా నిలబడటమూ బాధ్యతే" అని అభిప్రాయపడ్డారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా చేపట్టి, ప్రజల్లో మానవతా విలువలను పెంపొందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పినపాక జర్నలిస్టుల సంఘం గౌరవ సలహాదారు, యాగమాటి గంగాధర్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు, కొత్త దామోదర్ గౌడ్ క్లబ్ అధ్యక్షులు సత్ర పల్లి సారయ్య, ఉపాధ్యక్షులు వాగబోయిన సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి అతే లక్ష్మణ్, కోశాధికారి, కన్నె రమేష్ కమిటీ సభ్యులు, గోడిశాల చంద్రం, రాము గ్రామస్తులు పాల్గొని సహాయాన్ని అందించారు.

## ఉపాధ్యాయులుగా విద్యార్థులు

- మార్గదర్శినిలో ఘనంగా టీచర్స్ డే వేడుకలు




ఇల్లందు, సెప్టెంబర్ 6, ప్రజాజ్యోతి: పట్టణంలోని మార్గదర్శిని పాఠశాలలో టీచర్స్ డే ని పురస్కరించుకొని విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారారు. సెప్టెంబర్ 5 టీచర్స్ డే సెలవు రావడంతో శనివారం పాఠశాలలో ఘనంగా టీచర్స్ డే వేడుకలను గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయ అనుభవాలను తెలియజేశారు. పాఠశాలల్లో గురుపూజోత్సవాన్ని నిర్వహించి తమకు విద్యాబుద్ధులు నేర్పుతున్న ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. మార్గదర్శన హైస్కూ ల్ ప్రిన్సిపల్ యాదగిరి రాంబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయుల వేల కట్టలేనిదన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థిగా మారి విద్యార్థులకు విద్యాబోధన చేస్తారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులను ప్రతి ఒక్కరు గౌరవించాలని తెలిపారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం ప్రజలు సద్వినియోగం చేసుకోండి




కొత్తగూడెం, సెప్టెంబర్ 9 (ప్రజా జ్యోతి ): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చత్రపతి శివాజీ మహారాజ్ సేవా సంఘం ఆధ్వర్యంలో, హైదరాబాద్ శంకర్ కంటి ఆసుపత్రి సహకారంతో నేడు (ఆదివారం) ఉచిత కంటి వైద్య శిబిరం జరుగుతోంది. ఈ శిబిరం కొత్తగూడెం రైతు బజార్, పోచమ్మ తల్లి టెంపుల్ వద్ద కూలీ లైన్ ప్రాంగణంలో ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగనుంది. శిబిరానికి విచ్చేసే వారు తప్పనిసరిగా ఆధార్ కార్డు జిరాక్స్, ప్రస్తుతం వాడుతున్న మందులు, కుటుంబ సభ్యుల ఫోన్ నంబర్ తీసుకురావాలని నిర్వాహకులు సూచించారు. జిల్లా పట్టణ, గ్రామ పరిసర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చత్రపతి శివాజీ మహారాజ్ సేవా సంఘం కమిటీ సభ్యులు రేఖ రాజశేఖర్, పెద్దిరెడ్డి గోపిరెడ్డి, గునిగంటి చందర్, నమ్మి జగదీష్, ఏమునూరు శివ, సుంకు కనకరాజు, తెలంగాణ సురేష్, అత్తులూరి అరుణ్, వనమాల సుదర్శన్, ఠాకూర్ నారాయణ సింగ్, కరుణాకర్, ఈర్ల శ్యామ్ పిలుపునిచ్చారు.

## బత్తెనపల్లి ,బట్టిగూడెంలో వైద్య శిబిరం



చర్ల, సెప్టెంబర్ 06: (ప్రజా జ్యోతి ): చర్ల మండలంలో శనివారం సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న బత్తెనపల్లి బట్టిగూడెం గ్రామాల్లో డాక్టర్ నగేష్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరిగింది.ఈ వైద్య శిబిరంలో జ్వరంతో బాధపడుతున్న ఆరుగురికి ఆర్ డి టి మలేరియా పరీక్షలు చెయ్యడం జరిగింది వారికి మలేరియా లేదని వారికి మాములు జ్వరంగా నిర్ధారించి మందులు ఇవ్వడం జరిగింది. ఈ ఆరోగ్య శిబిరాల్లో సాధారణ వ్యాధులకు కూడా మందులు ఇవ్వడం జరిగింది రెండు గ్రామాల్లో కూడా రాఫీడ్ ఫీవర్ సర్వే చేయించడం జరిగింది.చిన్నపిల్లలకు వ్యాధినిరోధక టీకాలు వెయ్యడం జరిగింది పిల్ల తల్లులను గర్భిణీ స్త్రీలను పరీక్షించడంజరిగింది.ఈ సందర్భగా డాక్టర్ నగేష్ మాట్లాడుతూ గర్భిణి స్త్రీలు సురక్షితమైన ప్రసవం కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తప్పకుండా రావాలి అని జ్వరం వస్తే అశ్రద్ధ చెయ్యకుండా పి హెచ్ సి కి రావాలి అని అక్కడ అన్ని పరీక్షలు కూడా అందుబాటులో ఉన్నాయి అని చెప్పడం జరిగింది. వర్షాకాలం కాబట్టి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నీళ్లు నిల్వలేకుండా చూసుకోవాలని దోమ తెరలను వినియోగించుకోవాలని ఎల్లప్పుడు పరిశుభ్రమైన నీటిని తీసుకోవాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ నగేష్ మెడికల్ ఆఫీసర్,బాబురావు హెచ్ ఈ ఓ సంధ్య ఎమ్ హెల్ హెచ్ పి,రాజేశ్వరి ఏ ఎన్ ఎమ్ వరప్రసాద్ హెల్త్ అసిస్టెంట్ ఆశా కార్యకర్తలు జోగమ్మ తదితరులు పాల్గోనడం జరిగింది.

## వేలంపాటలో రికార్డు ధర పలికిన గణనాథుని లడ్డు

- పోటీపడి దక్కించుకున్న విజయసాయి సెల్ వర్డ్ అధినేత జితేంద్ర




అశ్వారావుపేట, సెప్టెంబర్ 06, ప్రజాజ్యోతి: వినాయకుని నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నియోజకవర్గ కేంద్రంలోని బస్టాండ్ సెంటర్లో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ గణపతి ఆలయం వద్ద కొలువుతీరిన గణేశుని లడ్డు పలువురు భక్తులు పోటీ పడడంతో వేలం పాటలో లడ్డు రికార్డు ధర పలికింది. తొమ్మిది రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించిన పూజా కార్యక్రమాలలో విగ్నేశ్వరుని లడ్డూను పట్టణానికి చెందిన విజయ సాయి సెల్ వరల్డ్ అధినేత శీమకుర్తి జితేంద్ర రూ.2 లక్షల రికార్డు ధరకు దక్కించుకున్నారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారిన వేళ



చర్ల, సెప్టెంబర్ 06: (ప్రజా జ్యోతి ): ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా చర్ల మండలంలో గల తేగడ శ్రీ సరస్వతి విద్యా నికేతన్ స్కూల్లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ సంబరాలు జరిగాయి .ఈ కార్యక్రమం లో విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తరగతి గదులకు విద్యార్థులు చూడమచ్చటగా ఉపాధ్యాయులలా వచ్చి వారే స్వయంగా టి ఎల్ ఎం లు తయారు చేసుకుని తరగతి గదిలో మిగిలిన విద్యార్థులకు ఎంతో చక్కగా పాఠాలను బోధించారు. ఈ సందర్భగా ఉపాధ్యాయురాలు లిఖిత మాట్లాడుతూ శ్రీ సరస్వతి విద్యానికేతన్ లో ఏ కార్యక్రమం జరిగిన విద్యార్థుల అభివృద్ధికి ఉపయోగపడేలా రూపొందించడం జరుగుతుంది అని అందులో భాగంగానే ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించాము అని ఉపాధ్యాయులుగా మారిన ప్రతి విద్యార్థి కొన్ని అంశాలు ఎంచుకొని వాటికి సంబంధించిన టిఎల్ఎం ను రూపొందించి ప్రాక్టికల్ గ బోధించటం జరిగింది అని టిఎల్ఎం లను ఉపయోగించి చెప్పడం వల్ల బోధించిన విద్యార్థికి తరగతి గదిలో కూర్చున్న విద్యార్థికి కూడా ఈ అంశం ఎంతో చక్కగా అర్థమైంది అని ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు కూడా ఎంతో సంతృప్తి చెందారు అని వారి బోధించే సామర్థ్యాన్ని పెంపొందించుకున్నారు అని అన్నారు . ఇది విద్యార్థులకు మంచి అనుభవమని దీని ద్వారా విద్యార్థులకు ఆత్మవిశ్వాసం ఎంతగానో వృద్ధి చెందుతుందని ఇది మాకెంతో ఆనందం అని ప్రధాన ఉపాధ్యాయులు లిఖిత అన్నారు అన్నారు. అలానే ఈ టిఎల్ఎంలో తయారు చేయడానికి తల్లిదండ్రులు కూడా పిల్లలకు ఎంతగానో సహకరించారని ఇటువంటివి ప్రోత్సహిస్తే ప్రతి విద్యార్థి కూడా ఎంతో గొప్పగా అభివృద్ధి చెందుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూలు యాజమాన్యం ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.





## జెకె 5 ఓసి ఉద్యోగులను అభినందించిన జియం



**ఇల్లందు, సెప్టెంబర్ 6, ప్రజాజ్యోతి:** జెకె 5 ఓసికి ఫైవ్ స్టార్ రేటింగ్ వచ్చినందుకు ప్రాజెక్ట్ ఆఫీసర్ కృష్ణ మోహన్, జెకె5 ఓసి ఉద్యోగులను శనివారం ఏరియా జియం కృష్ణయ్య అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బొగ్గు ఉత్పత్తి కంపెనీలలో గల ప్రమాదరహిత గనులకు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ప్రతి ఏడాది అందజేస్తున్న ఫైవ్ స్టార్ అత్యుత్తమ గనుల అవార్డుకు ఈసారి సింగరేణి ఇల్లందు ఏరియాలోని జెకె 5 ఓసి అందుకోవడం చాలా సంతోషమన్నారు. అలాగే నూతన జెకె ఓసిని కూడా ఇదే ఒరవడిని కొనసాగిస్తూ భవిష్యత్తులో కూడా గనికి కేటాయించిన ఉత్పత్తితో పాటు రక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న ఇతర గనులకు ఆదర్శంగా నిలుస్తు ఉత్పత్తి, ఉత్పాదకత పెంచుతూ సింగరేణికి మరింత మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏరియా సేఫ్టీ ఆఫీసర్ జాకీర్ హుస్సేన్, ఏరియా డీజీఎం (పర్సనల్) అజ్మీర తుకారాం, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ వి.అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అన్నదాన కార్యక్రమం

- ప్రారంభించిన ఎస్ఐ భాదావత రవి



**జూలూరుపాడు సెప్టెంబర్ 6 ( ప్రజా జ్యోతి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల పరిధిలోని అనంతరం గ్రామంలో ఆంజనేయ స్వామి గుడిలో గత ఎనిమిది రోజులుగా గణపతి నవరాత్రుల ఉత్సవాలు జరుగుతున్నాయి గణపతి నిమర్జనానికి చివరి రోజు కావడంతో గ్రామస్తులు ఉస్కెల వెంకటేశ్వర్లు కొరసా రమేష్, మల్కం వీరభద్రం లు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జూలూరుపాడు ఎస్సై భాగవత్ రవి మండల కాంగ్రెస్ నాయకులు మాలోత్ మంగీలాల్ నాయక్ లు పూజా కార్యక్రమంలోపాల్గొని అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా బాధాకరవి మాట్లాడుతూ ఈ సంవత్సరం ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని. ఎలాంటి గొడవలకు వెళ్ళరాదని చిన్న చిన్న సమస్యలను గ్రామంలోని పరిష్కరించుకోవాలని. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడవద్దని గ్రామస్తులు అందరూ ఐక్యంగా ఉండాలని కోరారు.

## నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం

**చర్ల, సెప్టెంబర్ 06: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో శనివారం భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ చిత్రపటానికి ఘనంగా పాలాభిషేకం చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులు గునూరి రమణ మాట్లాడుతూ దేశ ప్రజలకు మోడీ అందిస్తున్న దసరా దీపావళి కానుకగ జీవిత ఆరోగ్య బీమా ప్రీమియంపై జిఎస్టి రద్దుచేస్తూ ప్రతి ఒక్కరికి ఆరోగ్య ఆర్థిక భద్రత అందుబాటులోకి తీసుకువచ్చారు అని అయన తెలిపారు. నిరుపేద, మధ్య తరగతి కుటుంబాలకు నిత్యవసర వస్తువులుపై అదనపు భారం పడకుండా ప్రతి కుటుంబంలో ఆనందం చూడాలని భారత ప్రధాని నరేంద్ర మోడీ దసరా దీపావళి కానుకగా ప్రతి కుటుంబంలో వెలుగులు నింపారన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా కౌన్సిల్ మెంబెర్ బాబా ఫహీం. ఉపాధ్యక్షులు గంజి వెంకట్రావు .ప్రధాన కార్యదర్శి ఇర్పా సుబ్బారావు. కార్యదర్సులు కుప్పా మాధవరావు. ముత్తారపు శ్రీనివాస చారి. ఎంపిటిసి ఇంచార్జి. సరియం ధర్మరాజు. ట్రెజరర్ మడి శంకర్. బంద మధు చుక్కా శివా. చింతూరి విశ్వనాధ్. వెంబడి రమేష్. వి.నాగశ్వర రావు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా జర్నలిస్టుల వేడుకలు

- సమాజాన్ని చైతన్య పర్చడంలో జర్నలిస్టులదే కీలకపాత్ర
- ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బలరాం



**అశ్వాపురం, సెప్టెంబర్ 6, ప్రజా జ్యోతి:** అశ్వాపురం మండల కేంద్రంలో సత్యమేవ జయతే క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా జర్నలిస్టుల వేడుకలు జరిగినాయి. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు, బలరాం, కేవీ రెడ్డి, దేవేందర్, మురళి, ఏకాంబరం, మరికొందరు విలేకరులు పాల్గొని కేక్ కట్ చేసి ఒకరి కొకరు శుభాకాంక్షలు చెప్పుకుంటూ తినుబండారాలు పంచుకున్నారు. అనంతరం క్లబ్ అధ్యక్షుడు బలరాం మాట్లాడుతూ జర్నలిజం అనేది వాస్తవాలను, సంఘటనలను, వ్యక్తుల పరస్పర విషయాలను సేకరించి ధ్రువీకరించి విశ్లేషించి నిసపాక్షికంగా ప్రజలకు అందించే వృత్తి లేదా కార్యకలాపం. సమాజంలో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారిదిగా ఉంటూ అనేక రకాల సమస్యలను ఎదిరిస్తూ ప్రజల యొక్క నాడిని తెలియజేస్తూ ముందుకు సాగుతున్నాం. మనం ఐక్యంగా ఉంటూ నిజాయితీగా వార్తలు రాస్తే మన వృత్తికి భంగం కలగదని ఇప్పటికైనా అందరూ కలిపి జర్నలిజం ఉనికిని కాపాడుదాం అని అన్నారు. జర్నలిస్టులు పేదలకు మేలు చేసే వార్తలు, కథనాలు రాయాలని సూచించారు. చట్టాలపై పేదలకు అవగాహన కల్పించేలా వార్తలు రాసి, ప్రజలను చైతన్య పరచాలన్నారు. జర్నలిస్టులు ఎప్పుడు అద్దంలా ఉండాలని, విలువలు పెంపొందించుకోవాలని, నిజమైన వార్తలు ప్రచురించాలని, విలువలతో కూడిన జర్నలిజం సమాజానికి మేలు చేస్తుందని తెలియజేశారు.

## కామ్రేడ్ నర్రా రమేష్ మృతి పార్టీకి తీరని లోటు

- పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సంతాప సభ



**భద్రాచలం టౌన్, సెప్టెంబర్ 6(ప్రజాజ్యోతి):** సిపిఎం ఖమ్మం జిల్లా నాయకులు కామ్రేడ్ నర్రా రమేష్ మృతి పార్టీకి, కుటుంబానికి తీరని లోటని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి, పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి లు అన్నారు. పార్టీ భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నర్రా రమేష్ మృతికి నివాళులర్పిస్తూ సంతాప సభ నిర్వహించడం జరిగింది. డివైఎఫ్ఐ సీనియర్ నాయకులు పి సంతోష్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో వారు మాట్లాడుతూ కామ్రేడ్ నర్రా రమేష్ విద్యార్థి, యువజన, కార్మిక రంగాలలో ఎనలేని కృషి చేశారని అన్నారు. మార్క్సిస్టు పార్టీ నాయకుడిగా నమ్మిన సిద్ధాంతం కోసం తుది శ్వాస వరకు అనేక ఆటుపోట్లను ఎదుర్కొని నిలిచారని అన్నారు. ప్రజా సమస్యలపై అనేక మిలిటెంట్ ఉద్యమాలు నిర్వహించారని అన్నారు. కామ్రేడ్ నర్రా రమేష్ అనారోగ్యంతో అకాలంగా మృతి చెందడం పార్టీకి కుటుంబానికి తీరనిలోటని అన్నారు. సిపిఎం పార్టీ భద్రాచలం పట్టణ కమిటీ తరపున సంతాపాన్ని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సున్నం గంగా, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు డి సీతాలక్ష్మి పట్టణ కమిటీ సభ్యులు యు జ్యోతి, ఎన్ నాగరాజు, కుల గాని రమేష్, కోరాడ శ్రీనివాస్, ఎస్ భూపేంద్ర, కుంజా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామాలయంలో దర్శనాలు నిలిపివేత



**భద్రాచలం, సెప్టెంబర్ 6 (ప్రజాజ్యోతి ):** పాక్షిక చంద్రగ్రహణం నేపథ్యంలో దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో నేడు భక్తుల దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేయనున్నట్టు ఆలయ అధికారులు ప్రకటించారు. ఆలయ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం నేడు మధ్యాహ్నం 1 గంటకు ఆలయ తలుపులు మూసివేయబడతాయి. అనంతరం గ్రహణం పూర్తయ్యే వరకు అన్ని పూజా కార్యక్రమాలు, దర్శనాలు నిలిపివేయబడతాయి. గ్రహణం అనంతరం, సెప్టెంబర్ 8వ తేదీ సోమవారం ఉదయం 3 గంటలకు సుప్రభాతం కార్యక్రమంతో ఆలయం తిరిగి తెరవబడుతుంది. ఆ తరువాత ఆలయ శుద్ధి, సంప్రోక్షణ, ఆరాధన, సేవాకాలం, నివేదన వంటి సంప్రదాయ కార్యక్రమాలు పూర్తిచేసిన తరువాత ఉదయం 7.30 గంటలకు భక్తులకు స్వామి వారి దర్శనాలు పునఃప్రారంభం అవుతాయి. భక్తులు ఈ మార్పులను గమనించి తమ దర్శన ప్రణాళికలను అనుగుణంగా సర్దుబాటు చేసుకోవాలని ఆలయ అధికారులు సూచించారు.

## కామ్రేడ్ ఏచూరికి మనమిచ్చే ఘన నివాళ



**భద్రాచలం టౌన్, సెప్టెంబర్ 6(ప్రజాజ్యోతి):** దేశంలో మతతత్వ, ఫాసిస్టు శక్తులు బలపడుతున్నాయని వాటికి వ్యతిరేకంగా పోరాడటమే కామ్రేడ్ సీతారాం ఏచూరి కి మనం ఇచ్చే ఘన నివాళి అని సిపిఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అన్నారు. సీతారాం ఏచూరి ప్రధమ వర్ధంతి సభ 19వ వార్డు కమిటీ ఆధ్వర్యంలో వార్డు కన్వీనర్ డీ కనక శ్రీ అధ్యక్షతన జరిగింది. ముందుగా ఏచూరి చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకులు మూంద్రు ఝాన్సీ పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో స్వామి మాట్లాడుతూ దేశంలో మత ఉన్మాద శక్తులు ప్రజల మధ్య మతం పేరుతో చిచ్చు పెడుతున్నారని, దేశసమైక్యతను, ఐక్యతను విచ్ఛిన్నం చేస్తుందని అన్నారు. దేశాన్ని పాలిస్తున్న బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ మౌలిక అంశాలను ప్రజాస్వామ్యం, లౌకికవాదం, ఫెడరలిజం, సామ్యవాదం లను ధ్వంసం చేస్తోందని అన్నారు. ఎలక్షన్ కమిషన్, సిబిఐ, ఐడి మొదలగు స్వయం ప్రతిపత్తి కలిగిన రాజ్యాంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని అన్నారు. బీహార్ లో ఓట్లను తొలగిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని విమర్శించారు. కామ్రేడ్ ఏచూరి గారు దేశ సమైక్యత, సమగ్రత కోసం పాటుపడ్డారని అన్నారు. మత తత్వ శక్తులకు వ్యతిరేకంగా ప్రజాతంత్ర లౌకిక శక్తులను ఐక్యం చేసేందుకు ప్రత్యేకంగా కృషి చేశారని గుర్తు చేశారు. ఆయన స్ఫూర్తితో మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అదే ఆయనకు ఇచ్చే ఘన నివాళి అని అన్నారు. పార్టీ పట్టణ కమిటీ సభ్యులు సీనియర్ నాయకులు నాదెళ్ల లీలావతి, శాఖ కార్యదర్శి కాక రమణ, జి.నాగలక్ష్మి , సింగ్ కోటేశ్వరరావు, బేగం, హైమావతి, చోటిమా, దేవి, వీరభద్రం, తదితరులు పాల్గొన్నారు.

## పాత్రికేయులను ఘనంగా సన్మానించిన కాంగ్రెస్ పార్టీ



**గుండాల. ప్రజా జ్యోతి. 6.** కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కుండాల పార్టీకేయులను ఘనంగా సన్మానించారు వివిధ పత్రిక విలేకరులను శాలువాతో సన్మానించి వారి యొక్క సేవలను కొనియాడారు ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖదీర్ మాట్లాడుతూ విలేకరులు అనునిత్యం ప్రజా సమస్యలపై కథనాలు రాస్తూ అందర్నీ కదిలించే వారని వారి సేవలను గుర్తించి వారికి ఇలాంటి కార్యక్రమాల ద్వారా సన్మానించుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కుంభైన ముత్తయ్య దారా అశోక్ పూణెం లక్ష్మి వాజిద్ వు కే బుచ్చయ్య మోకాళ్ళ బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

# పచ్చని భద్రాద్రి కోసం పదివేల మొక్కలు నాటే సంకల్పం

- జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వి. శివ నాయక్



**భద్రాచలం, సెప్టెంబర్ 6,ప్రజాజ్యోతి :** భద్రాచలాన్ని పచ్చగా మార్చే కృషి ఒక మహత్తర ఉద్యమం. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని భద్రాచలం జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వి. శివ నాయక్ అన్నారు.శనివారం కోర్టు ఆవరణలో నిర్వహించిన గ్రీన్ భద్రాద్రి మొక్కల నాటే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, గ్రీన్ భద్రాద్రి సంస్థ నిస్వార్థంగా పచ్చదనాన్ని పెంపొందిస్తూ, భద్రాచలాన్ని పచ్చని భద్రాద్రిగా తీర్చిదిద్దడంలో చేస్తున్న కృషి వెలకట్టలేనిదని అభినందించారు. తన వంతుగా గ్రీన్ భద్రాద్రి వారితో మమేకమై రాబోయే ఏడాది కాలం లో పదివేల మొక్కలు నాటే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. పర్యావరణ సమతుల్యత కాపాడకపోతే రానున్న తరాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని ఆయన హెచ్చరించారు. చెట్ల పెంపకం ఒక్కరికి లేదా ఒక్క సంస్థకే పరిమితం కాకుండా ప్రతి పౌరుడి బాధ్యతగా చూడాలని పిలుపునిచ్చారు.బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి. శ్రీనివాసాచారి, న్యాయవాదులు పడిసిరి శ్రీనివాస్, బండారు రమేష్,గౌతమ్,శివకృష్ణ,లక్ష్మణ్,కోర్ట్ సూపరింటెండెంట్ రామచంద్రరావు, కోర్ట్ సిబ్బంది,కోర్ట్ కానిస్టేబుల్స్ చురుకుగా పాల్గొని మొక్కలు నాటారుఈ కార్యక్రమంలో గ్రీన్ భద్రాద్రి అధ్యక్షురాలు చిట్టే లలిత, కోఆర్డినేటర్ పామరాజు తిరుమలరావు, కోశాధికారి పూస రవికుమారి, మాజీ అధ్యక్షులు పల్లింటి దేశప్ప, భోణాల నాగ సూర్యనారాయణ, బోగాల శ్రీనివాస రెడ్డి, కామిశెట్టి కృష్ణార్జునరావు, ఉమాశంకర్ నాయుడు, గంగాధర వీరయ్య, సీనియర్ అడ్వకేట్ రమణారావు, ప్రియాంక, పి. లలిత, పచ్చిపులుసు సుబ్బారావు, రాసమళ్ళ రాము, భూక్యా రంగా తదితరులు పాల్గొన్నారు.పచ్చని భద్రాద్రి లక్ష్యంగా సాగుతున్న ఈ ఉద్యమంలో పాల్గొన్న వారందరికీ శివ నాయక్ కృతజ్ఞతలు తెలిపారు.

# అన్నపురెడ్డిపల్లి మండల వ్యాప్తంగా వినాయక నిమజ్జనాలు విజయవంతం



**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 6, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంతో పాటు గ్రామాల వ్యాప్తంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. మండలంలోని చిన్నా, పెద్దా గ్రామాలలో ప్రతిష్ఠించిన గణేశ మండపాల నుండి శోభాయాత్రలతో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు.భక్తుల నినాదాలతో, సంగీత బృందాల మధురమైన స్వరాలతో, ఊరేగింపుల సందడితో ప్రతి గ్రామం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. స్థానిక యువకులు, పెద్దలు, మహిళలు, చిన్నారులు పాల్గొని భక్తిశ్రద్ధలతో గణపతిని నిమజ్జనం చేశారు.మండల వ్యాప్తంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా శాంతియుతంగా నిమజ్జనాలు ముగియడం విశేషం. పోలీసు శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగలేదు. అగ్నిమాపక, వైద్య విభాగాలు అప్రమత్తంగా ఉండడంతో భక్తులు నిశ్చింతగా నిమజ్జనాల్లో పాల్గొన్నారు. ప్రతీ గ్రామంలో పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు, గణేశ మండపాల నిర్వాహకులు కలసికట్టుగా పనిచేయడం వలన ఎలాంటి ఇబ్బందులు రాలేదు. నిమజ్జనం అనంతరం వెంటనే శుభ్రతా కార్యక్రమాలు చేపట్టారు.మండలంలో వందలాది వినాయక విగ్రహాలు శోభాయాత్రలతో ఊరేగింపుల మధ్య శివార్లలోని చెరువులు, వాగులు, కాలువలలో నిమజ్జనం అయ్యాయి. గణేశుని నిమజ్జనం సందర్భంగా భక్తులు "గణపతి బప్పా మోర్యా" నినాదాలతో మారుమ్రోగించారు.ప్రజల సహకారం, నిర్వాహకుల కృషి, అధికారుల పర్యవేక్షణ వలన మండల వ్యాప్తంగా వినాయక నిమజ్జనాలు విజయవంతంగా పూర్తయ్యాయి.

# కామ్రేడ్ వెంకటరెడ్డి స్ఫూర్తితో వర్గ పోరాటాలు సాగించాలి

- సిపిఎం ఆధ్వర్యంలో శ్యామల వెంకటరెడ్డి 29వ వర్ధంతి సభ



**భద్రాచలం టౌన్, సెప్టెంబర్ 6 (ప్రజాజ్యోతి) :** అమరజీవి కామ్రేడ్ శ్యామల వెంకటరెడ్డి స్ఫూర్తితో వర్గ పోరాటాలు సాగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బి.నర్సారెడ్డి పిలుపునిచ్చారు. భద్రాచలం ఉమ్మడి డివిజన్ నాయకులు, రైతు సంఘం నేత అమరజీవి కామ్రేడ్ శ్యామల వెంకటరెడ్డి 29వ వర్ధంతి సభ పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన జరిగింది. ముందుగా వెంకటరెడ్డి చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకులు బిబిజి తిలక్, ఎం వి ఎస్ నారాయణ లు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఎంబీ నర్సారెడ్డి మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం ప్రాణాలు అర్పించిన మహానేత కామ్రేడ్ వెంకటరెడ్డి అని అన్నారు. అనేకసార్లు నక్సలైట్లు దాడులు జరిపినా, పార్టీకి రాజీనామా చేయకపోతే ప్రాణాలు తీస్తామని బెదిరించినా బెదరక నమ్మిన సిద్ధాంతంకు కట్టుబడి పార్టీ అభివృద్ధి కోసం కృషి చేశారన్నారు. భద్రాచలం డివిజన్లో రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కోసం, దళారుల దోపిడికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించారని గుర్తు చేశారు. వ్యవసాయ కార్మికులు కూలి రేట్ల కోసం సాగించిన పోరాటానికి బాసటగా నిలిచారని అన్నారు. ఏజెన్సీలోని ఆదివాసి గ్రామాల అభివృద్ధి రోడ్లు, విద్యుత్తు సాగునీరు, త్రాగునీరు తదితర సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పరితపించారని అన్నారు. కామ్రేడ్ శ్యామల వెంకట రెడ్డి గారి స్ఫూర్తితో వర్గ పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సున్నం గంగా పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పి సంతోష్ కుమార్, డి. సీతాలక్ష్మి , పట్టణ కమిటీ సభ్యులు ఎన్ నాగరాజు, ఉస్తెల జ్యోతి, కొలగాని రమేష్, కుంజా శ్రీనివాస్,కోరాడ శ్రీనివాస్, భూపేంద్ర, శాఖ కార్యదర్శులు వేణు, నాగలక్ష్మి సీనియర్ నాయకులు బి జె ఎల్ పి దాసు, మురళితదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదంలో గాయపడ్డ కాంగ్రెస్ నేతను పరామర్శించిన పొదెం వీరయ్య



**భద్రాచలం , సెప్టెంబర్ 6,ప్రజాజ్యోతి :** దుమ్ముగూడెం మండల సీనియర్ కాంగ్రెస్ పార్టీ నేత పిలక వెంకటరమణా రెడ్డి సోదరుడు పిలక నాగేశ్వర రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలపాలయ్యారు. ప్రస్తుతం ఆయన భద్రాచలంలోని జాగృతి ఆర్థోపెడిక్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ , జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పొదెం వీరయ్య హాస్పిటల్‌కు చేరుకుని నాగేశ్వర రెడ్డిని పరామర్శించారు.ప్రమాదానికి గురైన నాగేశ్వర రెడ్డిని వ్యక్తిగతంగా కలిసి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. బాధలో ఉన్న కుటుంబానికి తాను తోడుగా ఉంటానని, అవసరమైన అన్ని విధాల సహకారం అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులతో సమావేశమై ఆరోగ్య పరిస్థితిని సమీక్షించారు. వైద్యులు అందించిన సమాచారం మేరకు త్వరలోనే కోలుకుంటారని నమ్మకం వ్యక్తం చేశారు.నాయకుడిగా బాధలో ఉన్న వారికి అండగా నిలబడడం నిజమైన రాజకీయ సేవ అని పొదెం వీరయ్య పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు అందరూ కలసికట్టుగా ఉంటే ప్రతి కష్టాన్ని అధిగమించగలమని ఆయన వ్యాఖ్యానించారు. నాగేశ్వర రెడ్డి త్వరగా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆసుపత్రి వద్దకు చేరుకుని కుటుంబానికి సంఘీభావం తెలిపారు. పొదెం వీరయ్య పరామర్శతో కుటుంబ సభ్యులు ధైర్యాన్ని పొందారని పేర్కొన్నారు.

# నిత్య అన్వేషి పాత్రికేయులు: సీఐ రవీందర్



**గుండాల. ప్రజా జ్యోతి 6.** నిత్యం అనేక సమస్యలపై అన్వేషిస్తూ పాత్రికేయులు పనిచేస్తారని గుండాల సీఐ రవీందర్ అన్నారు శనివారం గుండాల మండల కేంద్రంలో జర్నలిస్ట్ డే సందర్భంగా ఆర్యవైశ్య వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సన్మాన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేసే పాత్రికేయులకు అయినా సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు ఆర్యవైశ్య సంఘం ఇలాంటి కార్యక్రమాలు చేయడం చాలా శుభ పరిణామాలని ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేయాలన్నారు నిస్వార్థంగా పనిచేసే పాత్రికేయులను గుర్తించి సన్మానించడం సంతోషకరమన్నారు ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు మానాల వెంకటేశ్వర్లు ఈ కార్యక్రమం ఏర్పాటు చేయగా విద్యాశాఖ అధికారి పార్వతమ్మవాసవి క్లబ్ అధ్యక్షులు మానాల శ్రావణ్ కుమార్ మానాల ఉపేందర్ శ్రీశైలం నాగరాజు రాంబాబు వీరన్న మానాల ప్రభాకర్ తదితరులు వివిధ పత్రిక పాత్రికేయులు పాల్గొన్నారు. ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ సన్మాన సభ. గుండాల మండల కేంద్రంలో హై స్కూల్ ప్రాథమిక గురుకులం కాలేజ్ ఉపాధ్యాయ అధ్యాపక సిబ్బందిని ఆర్యవైశ్య వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు ఉపాధ్యాయులను శాలువాతో కప్పి సన్మానించి వారి యొక్క సేవలను గుర్తు చేశారు.

# వెళ్లొస్తా.. మళ్ళోస్తా

- ► భక్తి పరవశ్యంతో గంగమ్మ చెంతకు
- ► అంగరంగ వైభవంగా కోలాటం ఊరేగింపుగా బయలు దేరిన గణనాధుని ప్రతిమలు

**అశ్వారావుపేట, సెప్టెంబర్ 06, ప్రజాజ్యోతి:** తొమ్మిది రోజుల పాటు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలందుకున్న బస్టాండ్ సెంటర్లో వేంచేసి ఉన్న లక్ష్మీ గణపతి ఆలయం లోని గణనాథుడు, దండాబత్తుల బజార్లోని గణేశుడు అంగరంగ వైభవంగా కోలాటం నృ త్యాలతో గంగమ్మ ఒడికి చేరుకున్నారు. తొమ్మిది రోజుల పాటు భక్తుల పూజలు అందుకొని, వెళ్ళొస్తా మళ్లీ ఏడాది మళ్ళోస్తా అంటూ గంగమ్మతల్లి ఒడికి చేరుకున్నాడు. దేవుళ్ల వేషధారణలతో ఊరేగింపు ఆకట్టుకుంది. ఆ గణనాధుని దీవెనలు భక్తులపై ఎల్లప్పు డు ఉంటాయని లక్ష్మీ గణపతి ఆలయ అర్చకులు చల్లపల్లి ప్రసాద్ శర్మ ,ఉత్సవ మూర్తి వద్ద తొమ్మిది రోజులపాటు వైభవంగా పూజలు నిర్వహించిన వేద పండితులు భరద్వాజ శర్మ తెలిపారు.





## నిరంతర ఉద్యమ నేత జవ్వాజీ లక్ష్మీ నారాయణ: తుడుం దెబ్బ





**గుండాల. ప్రజా జ్యోతి. 6.** నిరంతర ఉద్యమ నేతగా అలుపెరుగని పోరాట యోధునిగా జవ్వాజి లక్ష్మీనారాయణ అని తుడుం దెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య రాష్ట్ర అధ్యక్షులు పొట్ట ఉపేందర్ అన్నారు గుండాల మండల కేంద్రంలో తునం దెబ్బ నాయకులు వజ్జ ఎర్రయ్య అధ్యక్షతన జరిగిన జవ్వాజి లక్ష్మీనారాయణ ఏడో వర్ధంతిలో వారు మాట్లాడారు జవ్వాజి లక్ష్మీనారాయణ పేదలు బడుగు బలహీన వర్గాల కోసం అనునిత్యం పోరాడే వాడని ఆయన స్ఫూర్తి నేడు మమ్ములను నడిపిస్తుందన్నారు తుడుం దెబ్బ స్థాపన కోసం తను చేసిన కృషి మరువలేనిదన్నారు గిరిజనుల సమస్యలు ఐదో ఆరో షెడ్యూల్ తదితర డిమాండ్ల కోసం గిరిజనులను ఏకం చేసిన ఘనత జవ్వాజి లక్ష్మీనారాయణకి చెందుతుందన్నారు ఆదివాసి హక్కుల కోసం తుడుం దెబ్బ స్థాపించిన వ్యక్తులలో జవ్వాజి 1 లక్ష్మీనారాయణ ఒకరని విద్యార్థి ఉద్యమాల కోసం విద్యార్థి నాయకులను విద్యార్థులను ఏకం చేసి వెన్నుండి నడిపించే వాడన్నారు ఏజెన్సీలోని నిరుపేద నిరక్షరాశిత ఆదివాసుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ పోరాడే విధంగా నాయకులను ఐక్యం చేయడంలో తన పాత్ర కీలకమన్నారు జవ్వాజి లక్ష్మీనారాయణ లోటును ఎవరూ పూడ్చలేనని తన ఆశయ సాధన కోసం గిరిజనులంతా ఏకమై ఆశయాలను సాధించుటకై ఐక్యంగా పోరాడాలన్నారు ఈ కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు మాజీ ఎంపీపీ ముక్తి సత్యం కోరం సీతారాములు తుడుం దెబ్బ రాష్ట్ర నాయకులు కుబ్బాకుల శ్రావణ్ కుమార్ గుంపిడి వెంకటేశ్వర్లు కొడెం వెంకటేశ్వర్లు w వట్టం కన్నయ్య చింత వెంకటేశ్వర్లు మాస్ లైన్ నాయకులు పూణే మంగయ్య తెల్లం రాజు వాగబోయిన రమేష్ తోలం గోపి గోవింద నరసింహారావు కన్నయ్య సత్యం తదితరులు పాల్గొన్నారు.

# ఎన్కౌంటర్ మావోయిస్టును గుర్తింపు

- ప్లాటూన్ నెంబర్ 16 కమాండర్ గా గుర్తింపు
- మృతి చెందిన మహిళా మావోయిస్టుపై ఎనిమిది లక్షల రివార్డు
- భారీగా ఆయుధాలు పేలుడు పదార్థాలు స్వాధీనం








**చర్ల, సెప్టెంబర్ 06: (ప్రజా జ్యోతి ):** తెలంగాణ చర్ల సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్గఢ్ నారాయణపూర్ జిల్లా అబుజ్మద్ లోని ఓర్చా పోలీస్ స్టేషన్ పరిధిలోని బొండోస్, నెందూర్, గవాడి పరిసర ప్రాంతాలలో తూర్పు బస్తర్ డివిజన్‌కు చెందిన క్రియాశీల మావోయిస్టుల ఉనికి గురించి సమాచారం అందడంతో ఎస్పీ రాబిన్సన్ గుడియా సూచనల మేరకు ఈ ప్రాంతాన్ని సురక్షితంగా ఉంచే లక్ష్యంతో గురువారం నుండి జిల్లా నారాయణపూర్, దంతేవాడ డి ఆర్ జి ,ఎస్ టీ ఎఫ్ ల సంయుక్త పోలీసు బృందం ఈ ప్రాంతంలో నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ నిర్వహించింది. ఈ సందర్భగా శుక్రవారం నారాయణపూర్ డి ఆర్ జి ,ఎస్ టీ ఎఫ్ దంతేవాడ డి ఆర్ జి ల సంయుక్త పోలీసు బృందం నెందుర్–గవాడి అడవి కొండలకు చేరుకున్నప్పుడు, నిషేధిత మావోయిస్టు సంస్థకు చెందిన నక్సలైట్లు పోలీసుల బృందంపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. పోలీసులు భద్రతా దళ సిబ్బంది రక్షణ కోసం మావోయిస్టులపై ఎదురుకాల్పులు జరిపారు.పోలీసు బలగాలు అధికంగా ఉండటం చూసి మావోయిస్టులు పారిపోవాలని నిర్ణయించుకున్నారు. రోజంతా కవర్ వెనుక నుండి పోలీసు బృందంపై కాల్పులు జరుపుతూనే ఉన్నారు. ఈ ఎదురుకాల్పులులో పోలీసులు ఒక యూనిఫాం ధరించిన మహిళా మావోయిస్టు మృత దేహాన్ని ఆయుధాలు,మందుగుండు సామగ్రి, పేలుడు పదార్థాలు , రోజు వారీ ఉపయోగం కోసం ఉపయోగించే ఇతర వస్తువులను కూడా స్వాధీనం చేసుకున్నారు.గాలింపు చర్య సందర్భంగా సంఘటన స్థలంలో లభించిన రక్తపు మరకలను బట్టి, పెద్ద సంఖ్యలో మావోయిస్టులు గాయపడ్డారని అంచనా వేస్తున్నారు.మృతి చెందిన మావోయిస్టు క్యాడర్ ప్రాథమిక గుర్తింపు ఇలా ఉందిసోధి విమల, ప్లాటూన్ నంబర్ 16 కమాండర్ (పీ పీ సి సెక్రటరీ ) దబ్బకొంట పోలీస్ స్టేషన్ చింతగుఫా జిల్లా సుక్మా ఈ మావోయిస్టు పై ఎనిమిది లక్షల రివార్డ్ ఉన్నది .ఎన్‌కౌంటర్ స్థలం నుండి స్వాధీనం చేసుకున్న ఆయుధాలు , సామగ్రి పాయింట్ 303 రైఫిల్ ఒకటి ,బి జి ఎల్ లాంచర్ రెండు ,315 బోర్ రైఫిల్ ఒకటి ,బి జి ఎల్ సెల్ ఐదు , ద్రవ పేలుడు పదార్థం (జెలటిన్ స్టిక్) – తొమ్మిది (పంతొమ్మిది కిలోలు), రేడియో ఒకటి ,ఎలక్ట్రానిక్ స్విచ్ (కారు) ఒకటి ,ఇతర రోజువారీ వినియోగ వస్తువులు స్వాధీనం చేసుకున్నారు.పోలీస్ సూపరింటెండెంట్ రాబిన్సన్ గుడియా మాట్లాడుతూ ప్లాటూన్ 16 మాడ్ డివిజన్ కింద చురుగ్గా పని చేస్తూ అనేక నక్సల్ సంఘటనలలో పాల్గొంది అని న్యూ క్యాంప్ అడ్జుమ్ స్థాపన ఇంద్రావతి తూర్పు బస్తర్ ప్రాంతంలోని నక్సలైట్లలో భయాందోళనలను సృష్టించింది అని అబుజ్మద్ ఇకపై నక్సలైట్లకు సురక్షితం కాదు అని అబుజ్మద్ నుండి నక్సలిజాన్ని అంతం చేసే నిర్ణయాత్మక దశలోకి మనం ప్రవేశించాము అని నక్సలిజం యొక్క బోలు భావజాలంతో గందరగోళం చెంది అభివృద్ధి మార్గంలో అడ్డంకిగా మారుతున్న వారు, లొంగిపోయి గౌరవప్రదమైన జీవితాన్ని స్వీకరించడం ద్వారా జన జీవన స్రవంతిలో చేరాలి అని లేకుంటే వారు తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవలసి ఉంటుంది అని అన్నారు .బస్తర్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సుందరరాజ్ పట్టలింగం మాట్లాడుతూ నిషేధించబడిన చట్టవిరుద్ధమైన మావోయిస్టు సంస్థ సి పీ ఐ మావోయిజంకు వ్యతిరేకంగా బస్తర్ డివిజన్ అంతటా తీవ్రమైన ప్రచారం జరుగుతోంది అని ఈ ప్రచారం కొనసాగించడానికి బస్తర్ పోలీసులు కట్టుబడి ఉన్నారు అని రుతుపవనాల వంటి ప్రతికూల పరిస్థితుల్లో కూడా ఈ విజయం బస్తర్‌లో శాశ్వత శాంతి పురోగతి శ్రేయస్సును నిర్ధారించాలనే భద్రతా దళాల దృఢ సంకల్పాన్ని చూపిస్తుంది అని అన్నారు.

## అంకితభావమే ఆయుధం
# ఉత్తమ ఉపాధ్యాయుడిగా నిలిచిన దశమ్ బాబు





**భద్రాచలం ,సెప్టెంబర్ 6,ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని దుమ్ముగూడెం మండలంఆదివాసీ గ్రామమైన వైట్ నాగారంలో ఉన్న చిన్న పాఠశాలే ఆయన కర్మభూమి. అక్కడ చదువుతున్న ప్రతి విద్యార్థి భవిష్యత్తు వెలిగించాలన్నదే ఆయన లక్ష్యం. అదే తపన, అదే అంకితభావం ఆయనకు ఇప్పుడు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ను తెచ్చింది. ఆయనే కారంపూడి దశమ్ బాబు.ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కొత్తగూడెం ఐడీఓసీ కార్యాలయంలో జరిగిన ఘనమైన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వి. జితేష్ పాటిల్, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ట్రైనీ కలెక్టర్ సౌరవ్ శర్మ, జిల్లా గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు చేతులమీదుగా అవార్డు అందుకున్న ఆ క్షణం ఆయన జీవితంలో మర్చిపోలేని రోజు.



### ››› తన ప్రయాణం

చిన్న పట్టణంలో చదువుకున్న ఒక సాధారణ యువకుడు... గురువుగా మారి తన మొదటి నియామకంలో అడుగుపెట్టిన రోజే, "విద్యార్థుల జీవితాలను మార్చే శక్తి తన వృత్తిలోనే ఉంది" అని దశమ్ బాబు గుర్తించారు. ఆ రోజు నుండి ఈ రోజు వరకు ఆయన బోధనలో శ్రద్ధ, సేవలో నిబద్ధత, విద్యార్థుల పట్ల ప్రేమ ఎప్పుడూ తగ్గలేదు.

### ››› విద్యార్థులే బలం

పల్లెటూరి పిల్లలకు ఆంగ్లం కఠినంగా అనిపించినప్పుడు సులభమైన పద్ధతు ల్లో బోధించారు. గణితం భయం కలిగించినప్పుడు ఆటల రూపంలో నేర్పా రు. పాఠశాల వాతావరణం మారిందంటే, విద్యార్థులే ఆయన నిజమైన బలం. "వాళ్ల చిరునవ్వే నాకు బహుమతి" అని ఆయన చెబుతారు.

### ››› అభినందనల వెల్లువ

జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయునిగా గుర్తింపు పొందిన సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి సున్నం సమ్మయ్య, జడ్పీహెచ్ఎస్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఏవి రామారా వు, నరసాపురం జడ్పీహెచ్ఎస్ కాం ప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బెక్కంటి శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సంఘ నా యకులు, సహచర ఉపాధ్యాయులు, మిత్రులు, శ్రేయోభిలాషులు ఆయనను అభినందించారు.

### ››› సమాజానికి సందేశం

"ఒక ఉపాధ్యాయుని కృషి వందలాది కుటుంబాల భవిష్యత్తును మార్చగలదు. గురువులను గౌరవించడం అం టే మన భవిష్యత్తును గౌరవించడం" అని దశమ్ బాబు అభిప్రాయపడ్డారు.